కాముని చెరువులో ఏపుగా పెరిగినగుర్రపుడెక్క



ఇదే చెరువు సమీపంలో నత్తనడకన మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు



నమ్మండి.. ఇది చెరువే.!

బాలాజీనగర్‌ డివిజన్‌ పరిధిలోని చెరువులు గుర్రపుడెక్క పెరిగిపోయి పచ్చని మైదానాలను తలపిస్తున్నాయి. దీంతో కాముని చెరువు, మైసమ్మ చెరువు పరిసరాల కాలనీలు, గేటెడ్‌ కమ్యూనిటీల్లో దోమల బెడద విపరీతంగా పెరిగిపోయింది. ప్రజాప్రతినిదులు, అధికారులు తక్షణమే స్పందించి దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అంతకంటే ముందు గుర్రపుడెక్కను తొలగించాలని డిమాండ్‌ చేస్తున్నారు. – కూకట్‌పల్లి

దోమల నివారణకు..

మూసాపేట: డివిజన్‌ పరిధిలో దోమల తీవ్రత అధికంగా ఉండటంతో బుధవారం ఎంటమాలజీ సిబ్బంది మైసమ్మ చెరువులో ఆయిల్‌ బాల్స్‌ను కార్పొరేటర్‌ కొడిచెర్ల మహేందర్‌తో వేశారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా మైసమ్మ చెరువు పరిసర ప్రాంతాల్లో దోమల బెడద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో దోమల నివారణకు తక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చెరువులో ఉన్న గుర్రపుడెక్కను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌గౌడ్, అబ్బాస్, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మైసమ్మ చెరువులో ఆయిల్‌ బాల్స్‌ వేస్తున్న ఎంటమాలజీ సిబ్బందితో కార్పొరేటర్‌ మహేందర్‌

భట్రాజుల సమస్యలను పరిష్కరించండి

ఆల్విన్‌కాలనీ: లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచిన ఎంపీ ఈటల రాజేందర్‌ను బుధవారం భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదర్‌నగర్‌ డివిజన్‌ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీతారామరాజు మాట్లాడుతూ భట్రాజు కులస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు కూరపాటి కరుణాకర్, రాజు, రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు శ్రీరామరాజు, శ్రావణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఈటలకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీతారామరాజు

భూదేవిహిల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆల్విన్‌కాలనీ: భూదేవిహిల్స్‌ ఏర్పడి దాదాపు 14 సంవత్సరాలు అవుతున్నా నేటికీ మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్‌ అన్నారు. ఆల్విన్‌కాలనీ, జగద్గిరిగుట్ట డివిజన్ల మధ్యలో ఉండే ఈ కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. కొంతమంది మెప్పు కోసమే కార్పొరేటర్‌ భూదేవిహిల్స్‌ కాలనీని అభివృద్ధి చేయడం లేదని ఆయన ఆరోపించారు. కాలనీలో ఇళ్లు ఎక్కువ కావడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. అదే విధంగా రోడ్ల నిర్మాణం లేకపోవటంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన డీసీ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు.



డీసీకి వినతిపత్రం ఇస్తున్న కుమార్‌యాదవ్‌

ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటా

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన ఈటల రాజేందర్‌ బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ నాయకులు, వ్యాపారవేత్తలను, పార్టీ కార్యకర్తలను కలిశారు. కూకట్‌పల్లి పార్టీ సీనియర్‌ నాయకులు సీహెచ్‌ హనుమంతరావును ఆయన నివాసంలో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ప్రముఖ వ్యాపారవేత్త జనార్దనరావు నివాసంలో అల్పాహార విందులో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. అదే విధంగా డివిజన్‌ పరిధిలోని మైత్రీనగర్‌ కాలనీ అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త జగ్గారావు నివాసానికి వెళ్లారు.



కూకట్‌పల్లిలో పర్యటిస్తూ స్థానికులతో ముచ్చటిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌

◆ ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాశరావు, అర్పనపల్లి సూర్యారావు, అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీకర్‌రావు, మూసాపేట కార్పొరేటర్‌ కొడిచర్ల మహేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో రాజీ పడొద్దు

కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: అభివృద్ధి పనుల్లో రాజీ పడకుండా పెండింగ్‌ పనులను సైతం పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో బుధవారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతేడాది రూ.65కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్‌ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. టెండర్లు పూర్తయినా పనులను ఎందుకు పక్కన పెడుతున్నారని అధికారులను ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించాలని ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారి చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నర్సింహయాదవ్, పండాల సతీష్‌గౌడ్, శిరీషా బాబురావు, మండడి శ్రీనివాసరావు, డీసీలు రమేష్, ఎస్‌సీ చెన్నారెడ్డి, వాటర్‌వర్క్స్‌ జీఎం ప్రభాకర్, ఇంజినీరింగ్‌ ఈఈ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



అధికారులు, కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అధికారులు ప్రొటోకాల్‌ పాటించడం లేదని ఆగ్రహం..

ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారి విషయంలో అధికారులు కనీస ప్రోటోకాల్‌ పాటించడం లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల సమస్యలను కూకట్‌పల్లి జోనల్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వాటిని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా పెండింగ్‌లో ఉంచారన్నారు. తమను పక్కకు పెట్టి అధికార పార్టీ నాయకులు అంటూ అవగాహన లేని వారికి ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. నగరంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో సుమారు 7 చెరువుల వద్ద ట్రీట్‌మెంట్‌ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. వాటిని పూర్తి చేయడంలో అధికారులు ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికి వెనకడుగు వేసేది లేదు..

నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఏ మాత్రం శ్రద్ధ చూపకుండా కేవలం చిరు వ్యాపారాలపై పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు. కేవలం రాజకీయ ఒత్తిళ్లకే అధికారులు పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు మాత్రం ప్రజల పక్షాన పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి.. ప్రజా సమస్యల పరిష్కారానికి అందరిని కలుస్తానని తెలిపారు. ఈ నెలలో జరిగే శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి, మంత్రులను కలిసి తన నియోజకవర్గ సమస్యలను తెలియజేస్తానన్నారు.

మొగులమ్మ బస్తీలో సమస్యలను పరిష్కరించండి



సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గాంధీని కలిసిన మొగులమ్మ బస్తీవాసులు

ఆల్విన్‌కాలనీ: మొగలమ్మ బస్తీలో పలు సమస్యల పరిష్కరించి, చేపట్ట వలసిన పలు అభివృద్ధి పనులను చేపట్టాలని బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. బస్తీలో కొన్ని రోజులుగా తక్కువ ప్రెషర్‌తో మంచినీరు వస్తోందన్నారు. వెంటనే స్పందించిన ఆయన అధికారులతో ఫోన్‌ ద్వారా మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమస్య పునరావృతం కాకుండా స్వచ్ఛమైన మంచినీరు అందించాలన్నారు. త్వరలో కాలనీలో పర్యటించి నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

వర్షాకాలంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ స్నేహ శభరీష్‌

రాయదుర్గం: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా విధులు నిర్వహించాలని వెస్ట్‌జోన్‌ శేరిలింగంపల్లి జోనల్‌ కమిషనర్‌ స్నేహ శభరీష్‌ సూచించారు. గచ్చిబౌలిలోని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్‌ కార్యాలయంలో మాన్‌సూన్‌ బృందాలతో ఆమె బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనునిత్యం అప్రమత్తంగా ఉండి అవసరమైన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా వర్షం వస్తే వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాలాల ఆక్రమణలను తొలగించాలని, వర్షపునీరు ఆటంకం లేకుండా ముందుకు సాగేలా చూడాలన్నారు. వర్షం పడితే అందరూ అందుబాటులో ఉంటూ రోడ్లను పరిశీలిస్తూ ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా వాహనదారుల రాకపోకలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాలాల్లో చెత్తా, ఇతర వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ట్రాఫిక్‌ సమస్యలు కూడా తలెత్తకుండా పలు విభాగాలతో సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా డివిజన్‌ అభివృద్ధి

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని వివిధ కాలనీలలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కాలనీలలో అంతర్గత మురుగునీటి కాలువల సమస్య ఉందని, త్వరలో కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. మార్కెట్‌ రోడ్డులో నిర్మిస్తున్న మీట్‌ మార్కెట్‌ పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. డివిజన్‌ పరిధిలోని శ్మశాన వాటికలను పరిశీలించి, వాటి అభివృద్ధికి సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన డివిజన్‌ కార్యాలయం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్‌ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛ పటాన్‌చెరు కోసం ప్రతిఒక్కరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్‌ కుమార్‌ యాదవ్, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



హస్మత్‌పేట్‌ చౌరస్తాలో జరిగిన వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి దండు యాదగిరి

కూకట్‌పల్లి నియోజకవర్గంలో బుధవారం ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్‌లు కట్‌ చేసి సంబురాలు జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో కార్యకర్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. – కూకట్‌పల్లి జోన్‌ బృందం



కేపీహెచ్‌బీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న బండి రమేష్‌

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్‌



బ్యాంక్‌ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో మూతలేని మ్యాన్‌హోల్‌

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ జనప్రియనగర్‌ నుంచి బ్యాంక్‌ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్‌ మూత ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు అయ్యప్ప సొసైటీకి మార్గ మధ్య దారి కావడంతో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు పగలు, రాత్రి తేడా లేకుండా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్‌లో ప్రమాద సూచికగా కర్ర పెట్టారు. సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ వి. రామారావునగర్‌లో వెల్డింగ్‌ ఆంజనేయులు ఇంటి వద్ద కొన్ని రోజుల నుంచి వర్షపు నీరు నిల్వ ఉండటంతో సమీప నివాసితుల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. అంతేకాకుండా వర్షం నీరు రోడ్డుపై నిల్వ ఉండటంతో దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. దీంతో విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉంది. స్థానికులు సమస్యలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లటంతో వర్షం నీరు నాలాలోకి వెళ్లే విధంగా బుధవారం ఛానల్‌ పైప్‌లైన్‌ నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో వర్షం నీరు సాఫీగా వెళ్లేందుకు మార్గం సుగమమయిందని స్థానికులు తెలిపారు. పనులను స్థానిక నాయకుడు నాగుల సత్యం గంగపుత్ర, సాంబశివ, ఆంజనేయులు, ఖాజా, సువర్ణ దగ్గరుండి చేయించారు.



వి.రామారావునగర్‌లో రోడ్డుపై నిలిచిన నీటిని నాలాలోకి వెళ్లే విధంగా చర్యలు

విద్యారంగాన్ని బలోపేతం చేయడం హర్షణీయం

- జేఎన్‌టీయూహెచ్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌
- ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం యూనివర్సిటీలో జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థి నాయకులు జవ్వాజి దిలీప్, రాహుల్‌ నాయక్‌ మాట్లాడుతూ... రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్‌ ప్రభుత్వం విద్యారంగం బలోపేతానికి కృషి చేయడం హర్షణీయమని అన్నారు. టాటా టెక్నాలజీస్‌ సహకారంతో తెలంగాణలో 65 ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో రాణించే విధంగా ఆలోచన చేయటం శుభ పరిణామమన్నారు.

◆ అదే విధంగా ప్రభుత్వం ప్రకటించినట్లు పాఠశాల ఫీజుల నియంత్రణ చట్టం, ఇంజనీరింగ్‌ బీ-కేటగిరి సీట్లును ఆన్‌లైన్‌లో ఎంపిక చేసే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ ఇంజినీరింగ్‌ కళాశాలల విద్యార్థుల కోసం వివిధ రకాల పరిశ్రమలు, కంపెనీలతో ఎంఓయూలు చేసుకోవాలన్నారు. వారిలో ఇండస్ట్రియల్‌ నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకృష్ణ, గాదె పవన్, చందు, అనిష్, అర్జున్, రంజిత్, అరవింద్, బ్రహ్మం, ప్రేమ్, రామకృష్ణ, సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

హఫీజ్‌పేట్‌: ప్రేమ్‌నగర్‌లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై బుధవారం కాలనీవాసులు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ..బస్తీలోని అంతర్గత సీసీ రోడ్లు, తాగునీటి పైప్‌లైన్, విద్యుత్‌ స్తంభాలు తదితర అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గాంధీకి విన్నవించామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్తీలో నెలకొన్న సమస్యలపై తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారన్నారు. త్వరలోనే ప్రేమ్‌నగర్‌లో పర్యటిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సత్యం గౌడ్, మంగలి కృష్ణ, ప్రభాకర్, బాలా చారి, మల్లేష్, శివ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కేంద్ర మంత్రుల స్వాగత ఏర్పాట్లపై సమావేశం

సనత్‌నగర్‌: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ నగరానికి రానున్న సందర్భంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కరీంనగర్‌ పర్యటనలో ఉన్న బండి సంజయ్‌ గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు రానున్నారు. 4 గంటల సమయంలో కిషన్‌రెడ్డి కూడా వస్తున్నారు. బుధవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శులు దుగ్యాల ప్రదీప్‌కుమార్, కాసం వెంకటేశ్వర్లు, ప్రేమేందర్‌రెడ్డి, సెంట్రల్‌ జిల్లా అధ్యక్షులు గౌతమ్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌లు ఎయిర్‌పోర్ట్‌లో స్వాగత ఏర్పాట్లను పరిశీలించారు.

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలి

గచ్చిబౌలి: హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలని హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి హోంగార్డుల రాష్ట్ర సంక్షేమ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఓడీ హోంగార్డులను దృష్టిలో ఉంచుకొని హోంగార్డుల నియామకం చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. హోంగార్డులను రెగ్యులరైజ్‌ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని వారు గుర్తుచేశారు. హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల అశోక ఉపాధ్యక్షుడు హన్మంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, పీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్, ట్రెజరర్‌ గోపాల్‌ నాయక్‌ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న హోంగార్డుల రాష్ట్ర సంక్షేమ సంఘం సభ్యులు

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా బాలయోగం, యాగశాల, ద్వారతోరణా ధ్వజ కుంభారాధనం, బలిహరణం, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు తిరువీధుల్లో నిర్వహించారు.

నేడు హిందూ సామ్రాజ్య దినోత్సవం

మోతీనగర్‌: మోతీనగర్‌లోని రాయల్‌ గార్డెన్‌లో 20వ తేదీ రాత్రి 7గంటలకు హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌ చాలక్‌ డా. ఎస్‌కే జైస్వాల్‌ ఓ ప్రకటనలో తెలిపారు. 351 సంవత్సరాల క్రితం ఛత్రపతి శివాజీ హిందవీ సామ్రాజ్యాన్ని స్థాపించి సింహాసనాన్ని అధిష్టించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లున్న ఆయన తెలిపారు. అందరూ రాత్రి 7గంటలకు ముందే హాజరు కావాలని కోరారు.

ఎంఎంటీఎస్‌ రైలు ఢీకొని వ్యక్తి మృతి

హఫీజ్‌పేట్‌: ఎంఎంటీఎస్‌ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన హఫీజ్‌ఫేట్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్‌ కానిస్టేబుల్‌ భాగ్యరాజ్‌ తెలిపిన ప్రకారం వివరాలు బుధవారం ఉదయం 10 గంటలకు హఫీజ్‌పేట్‌ రైల్వేస్టేషన్‌ నుంచి హైటెక్‌ సిటీ రైల్వేస్టేషన్‌ మధ్యలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (30) రైలు పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్‌ రైలు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయం అయ్యింది. 108లో చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు నాంపల్లి జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మియాపూర్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ చోటుచేసుకుంది. ఎస్‌ఐ జగదీష్‌ తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని హఫీజ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఓ వ్యక్తి (55-65) అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని మంగళవారం ఉదయం 10 గంటలకు మియాపూర్‌ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మియాపూర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్‌: ఒడిశా నుంచి ఢిల్లీకి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను పట్టుకున్న సికింద్రాబాద్‌ రైల్వే పోలీసులు నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 15 లక్షల విలువ చేసే 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్‌ఎన్‌ జావేద్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్‌ ఇన్‌స్పెక్టర్లు సాయీశ్వర్‌గౌడ్, సరస్వత్‌ కథనం ప్రకారం..జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్‌ పోలీసులు సంయుక్తంగా ప్లాట్‌ఫామ్‌లు, రైళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ 2వ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న విశాఖ ఎక్స్‌ప్రెస్‌ రైలు జనరల్‌ బోగీలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో అనుమానాస్పదంగా కనిపించిన రెండు ట్రాలీ బ్యాగులను పోలీసులు అనిఖీ చేశారు. అందులోంచి గంజాయి ప్యాకెట్లు బయట పడ్డాయి. బ్యాగులను విశాఖ ఎక్స్‌ప్రెస్‌ రైలులో నగరానికి తరలించిన అస్సాం రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన దిలీప్‌కుమార్‌ (34) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆదే కేసులో గంజాయిని విక్రయించిన ఒడిశాకు చెందిన తపన్, ఢిల్లీలో వ్యాపారం చేసేందుకు దిగుమతి చేసుకునే ప్రయత్నం చేసిన బిజయ్‌లను నిందితులుగా చేర్చి వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జావేద్‌

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132